2 నుండి జాతీయస్థాయి నాటిక పోటీలు

వీరవాసరం: డిసెంబర్ రెండో తేది నుండి తోలేరులోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో 18వ జాతీయస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళా పరిషత్ నిర్వాహకుడు చవ్వాకుల సత్యనారాయణమూర్తి మంగళవారం తెలిపారు. రెండో తేదీన ప్రారంభ సభతోపాటు గంగోత్రి పెదకాకాని వారి అస్థికలు నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. మూడో తేదీన మొదటి ప్రదర్శనగా మద్దుకూరి క్రియేషన్స్ చిలకలూరిపేట వారి మృత్యుపత్రం, రెండో ప్రదర్శనగా హేలాపురి కల్చరల్ అసోసియేషన్, ఏలూరి వారి మనసున మనసై, మూడో ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్ కాట్రపాడు వారి ప్రక్షాళన నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. నాలుగో తేదీన మొదటి ప్రదర్శనగా చైతన్య కళాభారతి కరీంనగర్ వారి దొంగలు, రెండో ప్రదర్శనగా అరవింద్ ఆర్ట్స్ తాడేపల్లి వారి వెండి అంచులు నాటిక ప్రదర్శిస్తారని వివరించారు. ఈ నాటిక పోటీలతోపాటు రంగస్థల, సినీ నటులను సత్కరిస్తామని, పోటీల ముగింపు రోజున ఘంటసాల శతజయంతి వేడుక నిర్వహిస్తామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వకే రైల్వే పనులు ఆలస్యం

నరసాపురం-కోటిపల్లి రైల్వే లైన్ పనుల్లో జాప్యంపై కేంద్ర సహాయ మంత్రి వి.మురళీధర్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్ ఏర్పాటుకు రూ.2100 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించగా ఇప్పటి వరకు రూ.1100 కోట్ల మేర విలువైన పనులు పూర్తయ్యాయని కేంద్ర సహాయ మంత్రి వి.మురళీధర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా సొమ్ము ఇవ్వకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. మంగళవారం ఆయన నరసాపురం రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. రైల్వే లైన్ డబ్లింగ్, విద్యుద్దీకరణ, ఆర్ఒబి, నరసాపురం-కోటిపల్లి రైల్వే లైన్ పనులపై సంబంధిత అధికారులతో మంత్రి చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అతి సామాన్యుడు దేశమంతా మంచి సౌకర్యాలతో, తక్కువ ఖర్చుతో ప్రయాణం చేయాలన్నదే ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాలను అనుసంధానం చేసేలా పలు పథకాలను ప్రవేశపెట్టి పనులను వేగవంతం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మేనేజర్ శివేంద్ర మోహన్, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, డివిజనల్ ఇంజినీర్ కె.శ్రీధర్, తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, స్టేషన్ మాస్టర్ చినమిల్లి దివాకర్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి మురళీధర్

భీమవరం రూరల్: కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్ మంగళవారం భీమవరం పట్టణంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. తొలుత భీమవరం చేరుకున్న మంత్రి పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంలో ఇన్‌ఛార్జి డిఆర్ఓ దాసిరాజు, విశాఖపట్నం అసిస్టెంట్ పాస్‌పోర్ట్ అధికారి భాస్కరరావు, గ్రాంటింగ్ అధికారి ఫణికుమార్ కేంద్రమంత్రికి స్వాగతం పలికారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై మంత్రి ఆరా తీశారు. పాస్‌పోర్ట్ పొందేందుకు కార్యాలయానికి వచ్చే ప్రజలు వేచి ఉండడానికి సరైన వసతి లేక ఇబ్బంది పడుతున్నారని, పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రైల్వే లైన్ డబ్లింగ్, అండర్ పాస్ పనులను, రైల్వే క్వార్టర్స్‌ను మంత్రి పరిశీలించారు. ఆర్‌యుబి నిర్మాణంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట రైల్వే డివిజనల్ మేనేజర్ సీవేంద్రమోహన్, డిఇ ఎన్.శ్రీధర్, డిసిఎం జి.సోమశేఖర్‌నాయుడు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు, ఆర్‌విఎన్ ఎల్.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి డిఆర్ఓ దాసి రాజు ఉన్నారు. అనంతరం స్థానికంగా ఒక హోటల్‌లో బిజెపి ప్రతినిధులు, ప్రజలు కేంద్రమంత్రికి పలు వినతులు అందజేశారు. ఉండి రోడ్డు రైల్వేగేటు వద్ద, శృంగవృక్షం రైల్వే గేటు వద్ద ఇప్పటికే ఆర్ఒబిలు మంజూరయ్యాయని, వాటి స్థానంలో ఆర్‌యుబి నిర్మాణాలకు పరిశీలించాలన్నారు. ఆక్వా రంగం ఇబ్బందులు, ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలపై కూడా వినతులు అందజేశారు. అనంతరం పట్టణంలోని గునుపూడి 11, 12 వార్డుల్లో కేంద్ర ప్రభుత్వ సాయంతో నిర్మించిన టిడ్కో ఇళ్లను కేంద్రమంత్రి మురళీధరన్ కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి అక్కడ నివాసం ఉంటున్న ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. పలువురు లబ్ధిదారులు తాగునీరు, డ్రెయినేజీ సమస్య, వీధిలైట్లు లేకపోవడం, అపార్టుమెంట్‌కు అపార్టుమెంట్‌కు మధ్య గడ్డి పెరిగి ఇళ్లలోకి పాములు వస్తున్నాయని తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రోడ్డుపై ఆకతాయిలు లేకుండా పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేయించి గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుద్దీపాల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, వారం రోజుల్లో పనులు చేస్తారని చెప్పారు. 24 గంటలు తాగునీరు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, ఇన్‌ఛార్జి డిఆర్ఓ దాసి రాజు, టిడ్కో ఇఇ ఎంఎస్.స్వామినాయుడు, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, తహశీల్దార్ రవికుమార్, ప్రభాస్ యోజన రాష్ట్ర కన్వీనర్ పాకా సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి, బిజెపి నేతలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నేత గోపీమూర్తిపై నిర్బంధం

విజయవాడ ధర్నాకు వెళ్లకుండా పోలీసు స్టేషన్‌కు తరలింపు

ధర్నాకు అనుమతిచ్చి అరెస్టులేమిటని ఖండించిన ఉపాధ్యాయ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తిని భీమవరం పోలీసులు మంగళవారం రాత్రి అక్రమంగా నిర్బంధించారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉన్న గోపీమూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ నెల 30న యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై నిర్వహించనున్న ధర్నా నేపథ్యంలో గోపీమూర్తిని బైండోవర్ చేసి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ విజయవాడ ధర్నాకు అన్ని అనుమతులూ ఉన్నా ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడటం అప్రజాస్వామికమని విమర్శించారు. సమాజంలో స్వేచ్ఛగా నిరసన తెలుపుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందని, అయితే ఆ హక్కును వైసిపి ప్రభుత్వం కాలరాస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆందోళనలు సాగుతూనే ఉంటాయని విమర్శించారు.

భీమవరం పోలీసుల అదుపులో గోపీమూర్తి

అక్రమ అరెస్టును ఖండించిన యుటిఎఫ్

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని యుటిఎఫ్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. జిల్లావ్యాప్తంగా యుటిఎఫ్ నాయకులను అరెస్టు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఉపాధ్యాయుల పిఎఫ్ ఎపిజిఎల్ఐసి, సరెండర్ లీవ్ లోన్లు ఇతర బకాయిలు రూ.1826 కోట్లకుపైగా పేరుకుపోయాయని, వీటిని వెంటనే చెల్లించాలని ఈ నెల 22న జిల్లా కేంద్రాల్లో ధర్నా చేసినా ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. అందుకే విజయవాడలో ధర్నాకు సిద్ధమయ్యామని పేర్కొన్నారు. కనీసం ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలకు ఆహ్వానించకపోగా ధర్నాకు వచ్చే నేతలపై నిర్బంధం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం బకాయిలను చెల్లించాలని, ఉపాధ్యాయులపై పెడుతున్న బైండోవర్ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో చేపట్టే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ర్యాగింగ్ విష సంస్కృతిని వీడాలి

ఎఎస్‌పి అల్లూరి వెంకట సుబ్బరాజు

ఎఎస్‌పిని సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ర్యాగింగ్ పెద్ద నేరమని, ఆ విష సంస్కృతిని విడనాడాలని ఎఎస్‌పి అల్లూరి వెంకట సుబ్బరాజు అన్నారు. స్థానిక డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యాన ర్యాగింగ్ ద్వారా వచ్చే దుష్పరిణామాలు, పర్యవసానాలపై అవగాహనా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎఎస్‌పి సుబ్బరాజు మాట్లాడుతూ విద్యార్థులంతా ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థులు మానసిక వేదనకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ ఘటనలు దురదృష్టకరమని, తోటి విద్యార్థుల పట్ల నైతికత లేకుండా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని, క్రిమినల్ కేసుల్లో ఉన్న విద్యార్థులకు భవిష్యత్తులో అన్ని ఇబ్బందులేనని గుర్తించాలన్నారు. భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం కఠినమైన శిక్షలతోపాటు జరిమానాలు గరిష్టంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష తప్పదన్నారు. కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థుల జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. తమ కళాశాలలో ర్యాగింగ్‌కు తావు లేకుండా ప్రతిచోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీనియర్స్, జూనియర్స్ తరగతి గదుల నడుమ కొంతదూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది మంచి విద్యార్థి లక్షణం కాదని, ర్యాగింగ్ వల్ల ఎదుటివారు మానసికంగా చాలా ఇబ్బందులు పడతారని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.అంజన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ మంచి పేరు తెచ్చుకోవాలని, భావిభారత ఇంజినీర్లుగా తయారవ్వాలని అన్నారు. సీనియర్లు జూనియర్లకు ఆదర్శంగా నిలవాలన్నారు. వైస్ ప్రిన్సిపల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఫణికుమార్ అధ్యాపకులు డాక్టర్ జిజి.రత్నం, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి సుబ్బరాజును కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

ఎస్‌బిఐలో ఇంటి దొంగలు..!

జాయింట్ ఖాతా నుంచి రూ.42 లక్షలు మళ్లింపు

ఇద్దరు ఉద్యోగులను అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆన్‌లైన్ ద్వారా ఖాతాదారులకు చెందిన సొమ్మును తమకు చెందిన వారి ఖాతాలకు మళ్లించి రూ.42 లక్షలు స్వాహా చేసిన ఎస్‌బిఐ ఉద్యోగులను తాడేపల్లిగూడెం పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను స్థానిక పట్టణ పోలీసు స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భీమవరం డిఎస్‌పి బండారు శ్రీనాథ్ వెల్లడించారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన యెలిశెట్టి నరసింహారావు, ఆయన సోదరికి సంబంధించిన ఎస్‌బిఐ తాడేపల్లిగూడెం మెయిన్ బ్రాంచిలోని జాయింట్ ఖాతా నుంచి రూ.42 లక్షలు మాయమయ్యాయని 2022 ఆగస్టు 16న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులకు దర్యాప్తులో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. అన్నమయ్య (రాయచోటి) జిల్లా గాలివీడు ఎస్‌బిఐ బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ అప్పలరాజు పవన్‌కుమార్, అదే బ్రాంచిలో క్లర్క్ పూసపూటి వెంకట నవీన్‌కుమార్ ఇద్దరు కలిసి నగదు మాయమైన ఖాతాకు ఎటువంటి ఫోన్ నెంబర్ అనుసంధానమైనట్లు లేకపోవడం, ఎటిఎం లేదని గుర్తించారు. వారు ఆ ఖాతాకు తమ ఫోన్ నెంబర్‌ను అనుసంధానించి తద్వారా 27 యుపిఐ లావాదేవీల ద్వారా ఆ ఖాతాలోని రూ.42 లక్షల నగదును వివిధ రాష్ట్రాల్లోని తమకు పరిచయస్తులకు బదిలీ చేసి నగదు కాజేశారు. ఈ సైబర్ నేరం బ్యాంకు సిబ్బంది ప్రమేయంతో జరిగిందని గుర్తించి బ్యాంకు ఉన్నతాధికారులకు తెలియజేయగా ఆ ఉద్యోగుల నుంచి సొమ్ము రికవరీ చేసి ఆ బ్యాంకు ఖాతాకు జమ చేశారని డిఎస్‌పి తెలిపారు. పరారీలో ఉన్న ఇద్దరు ముద్దాయిల కోసం హర్యానా, ఢిల్లీ, అస్సోంలలో గాలించి సోమవారం అరెస్టు చేసి తాడేపల్లిగూడెం తీసుకొచ్చామన్నారు. ఈ కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసిన తాడేపల్లిగూడెం టౌన్ సిఐ నాగరాజు, ఎస్ఐ జిజె.ప్రసాద్, సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇంటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం చింతా రాజారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. వేతన బకాయిలు, టెండర్ల పేరుతో డబ్బు వసూలు చేయడం, బెదిరింపులు, పని ఒత్తిడి వంటి సమస్యలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. ప్రభుత్వం తక్షణం సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనబాట పడతామని హెచ్చరించారు. సంఘం జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులను తీర్థాలు, సంబరాలు, బీచ్‌లు వంటి చోట్లకు పంపి వెట్టిచాకిరీ చేయిస్తున్నారు తప్ప కనీసం వారికి ప్రయాణ ఛార్జీలు చెల్లించడం లేదన్నారు. తక్షణమే పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వేతన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివరాం, కిరణ్, రాజు, ఏసుబాబు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న రవి

వ్య.కా.స రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఏలూరు

డిసెంబర్ ఆరో తేదీ నుండి పదో తేదీ వరకూ జిల్లాలోని ఏజెన్సీ ముఖద్వారమైన జంగారెడ్డిగూడెంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభ, వివిధ కార్యక్రమాలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి కోరారు. మంగళవారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ చౌక్ వద్ద మహాసభల ప్రచార యాత్ర ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు జిల్లా నాయకులు పి.కిషోర్, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషులు పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. సంఘం రాష్ట్ర మహాసభ జిల్లాలో తొలిసారిగా జరగడం సంతోషదాయకమన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి, కూలీల ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. డిసెంబర్ ఆరో తేదీన ప్రజా సమస్యలపై ఫొటో ఎగ్జిబిషన్, ఉచిత వైద్య శిబిరం, ఏడో తేదీన హైస్కూల్, కళాశాల విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. వీటికి ప్రముఖ కళాకారుడు గోరటి వెంకన్న ముఖ్య అతిధిగా హాజరవుతారన్నారు. ఎనిమిదో తేదీన జంగారెడ్డిగూడెంలో వేలాది మందితో ప్రదర్శన, బహిరంగసభ ఉంటుందని తెలిపారు. ఎంపికైన 500 మంది ప్రతినిధులతో మహాసభ జరుగుతుందన్నారు. ఇందులో వ్యవసాయ రంగ అభివృద్ధి, వ్యవసాయ కార్మికుల భూమి, కూలీ, ఉపాధి అంశాలపై పోరాట కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ సంపూర్ణంగా జయప్రదం కావాలని కె.శ్రీనివాస్ ఆకాం క్షించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి రైతు, వ్యవసా య కార్మికుల ఐక్యత ఎంతగానో దోహదపడు తుం దన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశం చౌక్‌లో అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. దీక్షాధారులను పరామర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. నాడు అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన వాగ్దానాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. అగ్రిగోల్డ్ బాధితులు అన్నివిధాలా నష్టపోయారన్నారు. కొందరు ప్రాణాలు సైతం కోల్పోయారన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పాదయాత్రలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని వాగ్దానం ఇచ్చారన్నారు. కొంతకాలం గడిచాక అగ్రిగోల్డ్ బాధితుల విషయంలో ఏమాత్రం పురోభివృద్ధి లేకపోవడంతో పెద్దఎత్తున ఆందోళన చేస్తే నిధులు కేటాయించామని ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పిందన్నారు. నేటికీ ఈ సమస్యను పరిష్కరించలేదన్నారు. ఖాతాదారులు, ఏజెంట్లకు పెండింగులో ఉన్న చెల్లింపులను వెంటనే పూర్తి చేసి న్యాయం చేయాలన్నారు. ప్రాణాలు కోల్పోయినవారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో జరగబోయే అగ్రిగోల్డ్ బాధితుల ఉద్యమాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రజలందరూ అగ్రిగోల్డ్ బాధితులకు అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

నినదిస్తున్న నేతలు

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహారాజు అన్నారు. గొరగనమూడిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు, సర్పంచి గొట్టుముక్కల శివాజీరాజు, ఉప సర్పంచి గూడూరి వెంకట రామాంజనేయులు, పార్టీ గ్రామాధ్యక్షులు బొక్కా ప్రసాద్, కార్యదర్శి పెనుమాల సురేష్, నాయకులు చెల్లబోయిన పాపారావు, మల్లుల శ్రీనివాసరావు, దిడ్ల రవి, వైస్ ఎంపిపిలు నరేష్, ఆదాడ లక్ష్మితులసి, బొల్లా శ్రీనువాసు, పంపన రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న పివిఎల్

దర్భరేవు రైతులకు రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

దర్భరేవు ప్రాంతంలోని 1623 మంది రైతులకు 1754 ఎకరాల కంపెనీ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్ ప్రశాంతితో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసాద్‌రాజు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కంపెనీ భూములను రైతులకు పైసా ఖర్చు లేకుండా వారి పేరున రిజిస్ట్రేషన్ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తీరప్రాంత గ్రామమైన దర్భరేవులో వేల ఎకరాల భూములను ఉచితంగా ఇవ్వడం ముఖ్యమంత్రికి ఈ ప్రాంతంపై ఉన్న అభిమానాన్ని చాటుతుందన్నారు. ఇక నుంచి ఈ భూములపై సర్వహక్కులు లబ్ధిదారులకు లభిస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ చిరకాల కోరికగా ఉన్న కంపెనీ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముఖ్యమంత్రి చొరవతో పూర్తయ్యిందన్నారు. అనంతరం కంపెనీ భూముల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, తహశీల్దార్ ఎస్ఎంఎస్.ఫాజిల్, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోనీ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి, కలెక్టర్ ప్రశాంతి

'అమ్మఒడి'పై అవగాహన కల్పించాలి

ఎంఎల్ఎ చెరుకువాడ రంగనాధరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

అమ్మఒడి పథకానికి మార్చిలోనే లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు వాలంటీర్లకు సూచించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొయ్యేటిపాడులో వాలంటీర్లతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ అమ్మఒడి పథకానికి మాత్రం ప్రతియేటా వాలంటీర్లు మార్చిలోనే తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కర్రి ముని రామకృష్ణారెడ్డి, జెడ్‌పిటిసి కర్రి గౌరీసుభాషిణి, సొసైటీ ప్రెసిడెంట్ తమనంపూడి కోదండరమణారెడ్డి, గ్రామాధ్యక్షుడు మేడపాటి వీర వెంకటసత్యనారాయణరెడ్డి, తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రంగనాధరాజు

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై నేడు ధర్నా

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉద్యోగుల, ఉపాధ్యాయుల బకాయిలు విడుదల చేయాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ బుధవారం ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతలపల్లి కృష్ణమోహన్, మొగల్తూరు మండల ప్రధాన కార్యదర్శి కొల్లాటి బ్రహ్మయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పిఎఫ్ లోన్స్, ఫైనల్ సెటిల్మెంట్స్, సిపిఎస్ ఏరియర్స్ తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడలో నిర్వహించతలపెట్టిన ధర్నాకు పోలీసులు అనుమతి కూడా లభించడంతో మొగల్తూరు మండలం నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పేర్కొన్నారు.

విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థి దశలోనే సరికొత్త ఆలోచనలతో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని నాబార్డ్ డిడి ఎంటి అనిల్‌కాంత్ అన్నారు. స్థానిక దిరుసుమర్రు రోడ్డులో ఉన్న కెజిఆర్ఎల్ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు మార్కెట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఫిష్ అండ్ సి ఫుడ్, ప్రాసెసింగ్ టెక్నీషియన్ కోర్స్‌లో మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి, వారికి అనుకూలంగా సరికొత్త ప్రాసెసింగ్ విధానాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు.

నాగబాబుకు పలువురి అభినందన

ప్రజాశక్తి పాలకొల్లు

వైసిపి చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన పార్టీ సీనియర్ నేత గుణ్ణం నాగబాబును మంగళవారం పలువురు అభినందనందించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి మరింత బలపడుతుందన్నారు. అభినందనవారిలో కర్రా జయసరిత, రాజేశ్వరి, జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వడ్డి కాసులు,,గాదె ఆంజనేయులు ఉన్నారు.

అలవెన్స్ ఆపాలనుకోవడం దారుణం

ప్రజాశక్తి - పాలకొల్లు

వేతనం పెంచాలని కోరుతున్న విఆర్ఎల జీతంలో అలవెన్స్ ఆపాలనుకోవడం దారుణమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. విఆర్ఎలు తమ సమస్యలను మంగళవారం ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతం పెంచమని తాము మూడున్నర ఏళ్లుగా కోరుతున్నామని విఆర్ఎలు చెప్పారు. జీతం పెంచకపోగా అలవెన్సు కట్ చేస్తున్నామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నిమ్మల మాట్లాడుతూ విఆర్ఎల సమస్య చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పోరాటం చేస్తామని చెప్పారు.

పరీక్షలు చేస్తున్న డాక్టర్ కార్తిక్

మార్టేరులో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రజల ఆరోగ్య పరిస్థితులను గమనించి వారికి మెరుగైన ఆరోగ్యం అందించడమే లక్ష్యమని మార్టేరు పిహెచ్‌సి డాక్టర్ కె.కార్తిక్ అన్నారు. మార్టేరు-2లో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ట్రైల్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక్ మాట్లాడుతూ తమ పరిధిలోని ప్రజలను పరీక్షించి మందులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 104 మెడికల్ ఆఫీసర్ గుడిమెట్ల అనూష, సూపర్‌వైజర్ డి.కమలమ్మ, ఎఎన్ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పి అభిషేక్ పాల్గొన్నారు.

చింతపర్రులో భవనం ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాస్

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చింతపర్రు గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.21.80 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా భవనాన్ని, రూ.16 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గున్నం నాగబాబు, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, ఏడుకొండలు, జెడ్‌పిటిసి సభ్యులు గోవిందరాజులు నాయుడు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : గ్రామాల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోమటితిప్ప నార్త్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, గ్రామ సర్పంచి అల్లూరి శ్రీహరిరాజు పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రతిఒక్కరూ దేశభక్తి భావంతో మెలగాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రతి ఒక్కరూ దేశభక్తి భావంతో మెలగాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం నవుడూరు గ్రామానికి చెందిన వడ్డీ సుబ్బారావు రచించిన తాపీ చెక్కిన శిల్పం పుస్తకాన్ని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డీ సుబ్బారావు 25 సంవత్సరాల కిందటే నవుడూరు సెంటర్లో నేషనల్ ఫ్లాగ్ టవర్‌ను నిర్మించి తన దేశభక్తిని చాటుకున్నారన్నారు. ప్రతిఒక్కరూ దేశభక్తి కలిగి ఉండేలా తాపీ చెక్కిన శిల్పం పుస్తకాన్ని వడ్డీ సుబ్బారావు రచించడం శుభ పరిణామం అన్నారు. నేటి పరిస్థితుల్లో విద్యార్థి దశ నుంచే దేశభక్తి కలిగి ఉండేలా ఈ పుస్తకంలో అనేకమంది ప్రముఖుల జీవిత చరిత్రలను రాసినట్లు తెలిపారు. వడ్డీ సుబ్బారావును ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడూరి ఓంకార్, గొలగాని సత్యనారాయణ, నేలపోగుల వర్మ, పోలిశెట్టి దాసు, తోలేరు శ్రీను, పిప్పళ్ల ప్రసాద్, ఎరక రాజు చినబాబు, మైగాపుల నాగేశ్వరరావు, పంజా నారాయణ, యాళ్ల బండి చిన్న, వడ్డీ రాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సిపిఎస్ రద్దుకు ఉపాధ్యాయులు పోరాడాలి

ప్రజాశక్తి - అత్తిలి

సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ చేస్తున్న పోరాటంలో అధికసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి పిలుపునిచ్చారు. యుటిఎఫ్ అత్తిలి మండల విస్తృత కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల పట్ల విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. జిల్లా అధ్యక్షులు విజయరామరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జిల్లా తరుపున నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ మరింత బాధ్యతతో మండల శాఖను ముందుకు తీసుకెళ్లామని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా స్వామి, అప్పలరాజు, గౌరవ అధ్యక్షులుగా ఈశ్వర్, సహాధ్యక్షులుగా గోపీనాథ్, ధనలక్ష్మి, కోశాధికారిగా దుర్గారావు ఎన్నికయ్యారు. పరిశీలకులుగా నాగిరెడ్డిరామ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, రాజేష్, నరసింహరాజు, జయకుమార్, దత్తు, ఈశ్వర్, వెంకట్రావు, రామారావు, శివప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

పల్లిపాలెంలో పైపులైన్ వివాదం

అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న వైనం
ఎంపిడిఒ, పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచి
పనుల నిలిపివేత

పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎంపిపి ప్రభాకరరావు

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామపంచాయతీ నుంచి అనుమతులు లేకుండా పల్లిపాలెం గ్రామంలో పైపులైను పనులు చేస్తున్న సంఘటనపై మంగళవారం వివాదం చోటు చేసుకుంది. పల్లిపాలెం గ్రామంలోని మారెమ్మ మహాలక్ష్మమ్మ గ్రామ దేవతలకు చెందిన స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఇటీవల స్థానికులు శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఒక వ్యక్తి పైపులైను వేసేందుకు మంగ ళవారం ఉదయం కొంతమంది కూలీలతో పని ప్రారంభిం చారు. సమాచారం తెలుసుకున్న గ్రామ సర్పంచి తిరుమ లశెట్టి శకుంతల భాస్కరరావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఆ ప్రాంతానికి వెళ్లి తక్షణం పనులు నిలిపివేయాలని సూచించారు. పంచాయతీ అధికారులకు చెప్పి తాను పైపులైను పనులు చేపట్టానని సంబంధిత వ్యక్తి అనడంతో సమస్య తారాస్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో సర్పంచి ఇతర ప్రజాప్రతినిధులు ఎంపిడిఒకు, పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. పంచాయతీ తీర్మానం లేకుండా చేస్తున్న పైపులైను పనులను తక్షణం నిలిపివేయాలని గ్రామ సర్పంచి తిరుమల శెట్టి శకుంతల భాస్కరరావు డిమాండ్ చేశారు. తక్షణం పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఎంపిపి ఎం.ప్రభాకరరావుతో పాటు కాళ్ల పోలీసులు పరిశీలించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. తక్షణం పనులు చేపట్టిన వ్యక్తి పేరిట పంచాయతీలో ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని ప్రభాకరరావు స్పష్టం చేశారు. ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, క్లస్టర్ కార్యదర్శి శిక్షణ తరగతుల్లో ఉండటం వల్ల పనులను తాత్కాలికంగా నిలిపివేశామని తెలిపారు. వేరే మార్గం నుంచి పైపులైను వేసుకోవాలని తాము సూచించిన సంబంధిత వ్యక్తి కమ్యూనిటీ హాలు నిర్మాణం ప్రాంతం నుంచే వేసుకుంటుండంతో ఆ పనులు నిలిపివేశామని సర్పంచి తెలిపారు.

ఉత్తమ వైద్యాధికారిగా గంగునాయుడు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు ఉత్తమ వైద్యాధికారి అవార్డు అందుకోవడం అభినందనీయమని పలువురు వైద్యులు అన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ఎం.గంగునాయుడు ఉత్తమ వైద్యాధికారి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం పలువురు అభినందించారు. ఇటీవల ప్రారంభమైన ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం ద్వారా గ్రామాల్లో ప్రజలకు మెరుగైన చికిత్స అందించడంలో గంగునాయుడు అత్యుత్తమ సేవలందించారు. దీంతో అవార్డు అందుకున్న ఆయనను మార్టేరు వైద్యాధికారి డాక్టర్ కె.కార్తిక్, పెనుమంట్ర వైద్య అధికారులు వై.అనూష, కె.లావణ్య, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.



ఉత్తమ వైద్య అధికారి అవార్డు అందుకుంటున్న గంగునాయుడు

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలి

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఇదేంకర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి గోదావరి జిల్లాలకు విచ్చేస్తున్న చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి కోరారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో మంగళవారం నిర్వహించిన ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 45 రోజుల పాటు నియోజకవర్గంలోని 11 క్లస్టర్లలోని గ్రామ వార్డుల్లో ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలను తెలుసుకొని నమోదు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ఇదేంకర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో బూత్ ఇన్‌ఛార్జులు, గ్రామ, వార్డు నాయకులు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇదేంకర్మ రాష్ట్రానికి ప్రోగ్రాం పరిశీలకులు, శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కార్యక్రమం నియోజకవర్గ పరిశీలకులు దాసరి ఆంజనేయులు, అంగన్‌వాడీ డ్వాక్రా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, వీరవాసరం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని పాల్గొన్నారు.రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి మాదాసు కనకదుర్గ, జిల్లామహిళా ఉపాధ్యక్షురాలు సయ్యద్ నసీమాబేగం, నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, హరిబాబు, బొడ్డు మోహన్, గునుపూడి తిరుపాల్, చెల్లబోయిన సుబ్బారావు, గంటా త్రిమూర్తులు, పామర్తి వెంకటరామయ్య, పంతం వెంకటసతీష్, కటికల పల్లారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక 16వ వార్డులో అగ్ని ప్రమాద బాధితులను ఎంఎల్ఎ మంతెన రామరాజు మంగళవారం పరామర్శించారు. రామనబోయిన సుబ్రహ్మణ్యం, బోడాల మహేష్ ఇంటికి వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. రెండు కుటుంబాల వారికి ఒక్కొక్కరికి రూ.ఐదు వేలు చొప్పున రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం స్థానిక వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం 11వ వార్డులో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను పరిశీలించారు. ఆయనతో పాటు స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా షష్ఠి ఉత్సవాలు



నరసాపురంలో చాగంటి మురళీకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్



పెనుమంట్రలో సౌకర్యాలు పరిశీలిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవ వేడుకలు ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎస్ఆర్ఎస్ ఇంపెక్స్ అధినేత చాగంటి మురళీకృష్ణ (చిన్న) ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి చినబాబు, నరసాపురం ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్, తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాసరావు, డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, మాధంశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు. వేడుకలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా అంబాజీ పేటకు చెందిన సంగీత సర్వనిధి, నేషనల్ అవార్డు గ్రహీత రాజేష్ గురుస్వామిచే విజయదుర్గా అయ్యప్ప గానామృతం భజన ఏర్పాటు చేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి చాగంటి చిన్న తండ్రి ఉమా నాయుడు జ్ఞాపకార్థం అఖండ అన్నసమారాధనను నిర్వహించారు.

కాళ్ల : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా యాత్రికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరుపాడు, జువ్వలపాలెం, కాళ్లకూరు, కాళ్ల, సీసలి, బొండాడ, కోపల్లె, పెద అమిరం, జక్కరం, కలవపూడి, వావిలాలపాడు శివాలయాల్లో షష్ఠి వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీరవాసరం : వీరవాసరంలో, తోకలపూడి, తోలేరు గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తోలేరులో సాంస్కృతిక కార్యక్రమాలు యాత్రికులను విశేషంగా ఆకర్షించాయి. పలు దేవాలయాల వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

ఆచంట : మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు యాత్రికులతో కళకళలాడాయి. పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు స్వామివారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కొడమంచిలి గ్రామంలో రథోత్సవం జరిగింది. ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కరుగోరుమిల్లి, ఆచంట, వేమవరం పలు గ్రామాల్లో వేడుకలు జరిగాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పెనుమంట్ర : షష్ఠి ఉత్సవాలను మండలంలోని పలు గ్రామాల ఆలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గత 40 సంవత్సరాలుగా బ్రాహ్మణచెరువులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాలు నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే యాత్రికులకు దాతల సహాయంతో పులిహార తదితర ప్రసాద రూపంలో ఉచితంగా అందిస్తున్నట్లు నిర్వాహకులు తేతలి సుధీర్ రెడ్డి, కూసంపూడి సుబ్బరాజు, సాయినాథ్ రెడ్డి, గాదిరాజు సాయిరామరాజు తెలిపారు. పెనుమంట్ర, మల్లిపూడి, జుత్తిగ, నత్త రామేశ్వరం, ఆలమూరు, నెలమూరు, ఓడూరు, మార్టేరుతో పాటు పలు గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు నిర్వహించారు.

పోడూరు : మండలంలోని గుమ్మలూరు, పెనుమదం, పండితవిల్లూరు గ్రామాల్లో మంగళవారం సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

పాలకొల్లు : పట్టణంలోని పలు ఆలయాల్లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం మంగళవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. సుబ్బారాయుడు ఆలయం వద్ద శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తెల్లవారుజామునుంచి పోటెత్తారు.

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణాల్లో మంగళవారం భారీ అన్న సమారాధన చేశారు. షష్ఠి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని ఉచితకాలవ, కోట రోడ్డు, ముత్యాలపల్లి, వారతిప్ప, కోమటితిప్ప, పాతపాడు, పేరుపాలెం, సేరేపాలెం గ్రామాల్లో షష్ఠి ఉత్సవాల సందర్భంగా సంగీత విభావరి కోలాటం కార్యక్రమాలు నిర్వహించారు.

ఉండి: మండలంలోని చినపుల్లేరు, ఉండి, పాములపర్రు, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలను ఎంఎల్ఎ మంతెన రామరాజు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పెద్దలు రామరాజును శాలువా కప్పి సత్కరించారు. పాములపర్రు ఆలయం వద్ద నిర్వహించిన అఖండ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంతెన రామరాజు మాట్లాడుతూ ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు.

NAME CHANGE

I. MOHAMMED VAZEERUDDIN, S/o. Mohammed Mubashruddin, D.No. 1-28, Shadikhana Rao, Krovvidi, Nidamarru Mandal, West Godavari Dist., A.P., I hereby declare that, I have been changed my Minor Daughter's name from **MOHAMMAD FAIZATABASSUM** (Old Name) to **MOHAMMED FAIZATABASSUM** (New Name). Hence after my Minor daughter's documents and correspondence will be continue with her new name **MOHAMMED FAIZATABASSUM.**

NAME CHANGE

I. FAMEEN, W/o. Mohammed Vazeeruddin, D.No. 1-29, Shadikhana Street, Krovvidi, Nidamarru Mandal, West Godavari Dist., A.P., have changed my Name from **FAMEENA** (Old Name) to **FAMEEN** (New Name). Hence after all my documents and correspondence will be continue with my new name **FAMEEN**

పాస్‌పోర్టు పోయినది

EDA VIMALA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 08-02-2017న **P5702598** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు లిఖితపూడి గ్రామం నుండి నరసాపురం పట్టణం వెళ్తుండగా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

EDA VIMALA
D/o. Eda Prakasa Rao, D.No. 3-61, Subbarayudu Gudem, Likhithapudi, Saripalli Post, Narasapuram Mandal, West Godavari Dist., A.P.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన పశ్చిమగోదావరి జిల్లా, అత్తిలి మండలం, వరిఘేడు శివారు ఎర్రనీలిగుంట, ప్రస్తుతం తణుకు మండలం, పైడిపర్రు గ్రామ కాపురస్తులు **పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ గారి కుమారుడు భాస్కరరావు గారు** నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, ది. 20-11-2022 నా క్లయింటు ఇంటి స్థలం ఒరిజినల్ దస్తావేజు నెం. 2243/2013 ఆఫ్ SRO, సజ్జాపురం మరియు SBI Life Insurance ఒరిజినల్ బాండు నెం. IK 661279506 జిరాక్స్ తీసుకొనుటకు పైడిపర్రు సెంటర్ నందు జిరాక్స్ తీసుకుని మరలా యింటికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో నా క్లయింటు యొక్క ఒరిజినల్ స్థలం దస్తావేజు, SBI Life Insurance ఒరిజినల్ బాండు పడిపోయినవి. కావున సదరు ఒరిజినల్ దస్తావేజు మరియు ఇన్సూరెన్సు బాండు ఎవరికైనా దొరికిన యెడల మాకు గాని, మా క్లయింటుకు గాని తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

**VENNAPU SUDHAKARA RAO
KAKOLLU VIJAYA**
Advocates, D.No.18-5-2, IInd Floor
AMR Complex, Atyam vari Street
Tanuku-534211, W.G.Dt (A.P)

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా కోర్టు, ఏలూరు
ట్రాన్స్‌ఫర్ ఓ.పి. నెం. 17/2022

శ్రీమతి మద్దుల విజయలక్ష్మి వగైరా **-పిటీషనర్లు**
మరియు
శ్రీమతి జూపూడి దేవిశ్రీ వెంకట నాగమణి సావిత్రి వగైరా **-రెస్పాండెంట్లు**

పై నంబరు ఓ.పి. గ్రంధమును ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఫైలు ఓ.ఎస్. నెం. 301/2013 దావాను, ఆ కోర్టు నుండి ఏలూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేయవలసినదిగాను, అక్కడ పెండింగులో వున్న ఓ.ఎస్. నెం. 176/2018 కలిపి విచారించవలసినదిగాను దాఖలు చేయగా, పై నంబరు ఓ.పి. గ్రంధములో 3వ రెస్పాండెంటు అయిన
శ్రీ మద్దుల వెంకట గోపాల అచ్యుత మాధవ్,
తండ్రి: శ్రీ మద్దుల దామోదరరావు,
డోరు నెం. 24బి-10-23, రాఘవాచారివారి వీధి,
రామచంద్రరావుపేట, ఏలూరు - 534002.

గారికి నోటీసులు నిమిత్తము ది. 13-12-2022 తేదీని వాయిదా అయివున్నది. కాబట్టి సదరు 3వ రెస్పాండెంటు పై కోర్టు వారి ఎదుట **ది. 13-12-2022 తేదీని ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్సుపార్టీ చేసి కోర్టు వారు తగు ఉత్తరువులు దయ చేయగలరని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఏలూరు **ఎస్.వి.ఆర్.గాంధీ**
తేదీ:24-11-2022 పిటీషనర్ల తరపు అడ్వకేట్

NAME CHANGE

I. MOHAMMED VAZEERUDDIN, S/o. Mohammed Mubashruddin, D.No. 1-28, Shadikhana Road, Krovvidi, Nidamarru Mandal, West Godavari Dist., A.P., have changed my name from **MOHAMMAD VAZEERUDDIN** (Old Name) to **MOHAMMED VAZEERUDDIN** (New Name). Hence after all my documents and correspondence will be continue with my new name **MOHAMMED VAZEERUDDIN.**

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 270/2020

Between:
Canara Bank (e-Syndicate Bank), Tanuku, Rep. by its Manager. ***...Plaintiff***
AND
1) Yentrapragada Vijaya Kumar, S/o. Joseph, RTC Driver, Tanuku.
2) Pagada Srinivasa Rao, S/o. Naga Bhushanam, Superintendent, APSRTC, Tanuku. ***...Defendants***

వాదికి రావలసిన బాకీ రూ.4,45,292-17 పైసలు, దర్మిలా వడ్డీ మరియు ఖర్చులు నిమిత్తం ప్రతివాద్లు పై దావా దాఖలు చేసియున్నారు. సదరు పై నెంబరు దావా నందు 1,2 ప్రతివాదులు హాజరు నిమిత్తం ది.28-12-2022న వాయిదా అయి ఉన్నది. 1,2 ప్రతివాదులు **ది.28-12-2022వ తేదీన పైన తెల్పిన కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయితూ స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ యొక్క ఆక్షేపణలు దాఖలు చేసుకొనవలెను.** ఇందుకు తప్పే యెడల పై నెంబరు దావా 1,2 ప్రతివాద్లు యొక్క పరోక్షమునందు తీర్మానింపబడునని యిందుమలముగా తెలియజేయడమైనది. ఈ ప్రకటన ది. 21-11-2022వ తేదీ గల కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ప్రకటించడమైనది.

సి.యస్.వి.యస్.బుస్సీ
తణుకు, వాది తరుపు న్యాయవాది,
28-11-22. తణుకు. సెల్: 99895 67750

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిలు జడ్జి వారు, తాడేపల్లిగూడెం
ఐ.ఎ. నెం. 199/2018
అందున
ఓ.ఎస్. నెం. 258/2018

మధ్య:
పిటీషనరు/ వాది:
శ్రీమతి పేరాబత్తుల సీతామహాలక్ష్మి
మరియు
రెస్పాండెంటు/ప్రతివాదులు:
శ్రీ పేరాబత్తుల వెంకటేశ్వర్రావు వగైరాలు

కోర్టు వారి ఆనతి మేర

పై దావాను మరియు పిటీషనుతో వాది/పిటీషనరు మీ పై ఇంజక్షను కోరి దాఖలు చేసి పెక్కుదినములు అయినను మీరు సదరు దావా గ్రంధమున మరియు టెంపరరీ యింజక్షను గ్రంధమున 3వ ప్రతివాది/ పిటీషనరు అయినను మరియు మీరు 1వ వారి కుమార్తె అయివుండి 1 మరియు 2 వారలతో జీవనము సాగించుచున్నను కావలెనని కాలయాపన సాగించుచున్నారు. సదరు విషయమును కోర్టు వారి దృష్టికి తీసుకు వెళ్ళగా శ్రీ కోర్టు వారు సదరు ఐ.ఎ నోటీసును మరియు దావా సమను తమ పేపరు ద్వారా పంపించ ఆదేశించినందున

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా సదరు పై గ్రంధము **ది. 06-12-2022న వేసియున్నారు.** కావున ఆరోజున మీరు ఖుద్దున గాని, విషయ పరిచయము గల వకీలు గారి ద్వారా ఆరోజున వచ్చి తమ స్టేటుమెంటు మరియు కౌంటరులు దాఖలు చేసుకొనగలరు. అట్లుల కాని పక్షమున సదరు దావా గ్రంధము మరియు పిటీషను మీ పరిముఖము లేకనే తదుపరి స్టెప్ తీసుకొన బడునని యిందుమూలముగా తెలియచేయుచున్నాను.

Kum. Perabattula Venkata Sita Mahalakshmi, daughter of Venkateswara Rao, aged 18 years, Hindu, H.No. 1-29/1, Student, In the house of Mutyala Narasimha Murthy, Main Road, Nidamarru.

యాళ్లబండి రామకృష్ణ పరమహంస
అడ్వకేటు, తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం సెల్: 9948169761
తేదీ. 29-11-2022 6303018736

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం రెండవ తరగతి మెజిస్ట్రేటు కం 2వ తరగతి జూనియర్ సివిలు జడ్జి, తాడేపల్లిగూడెం
ఐ.ఎ. నెం. 65/2020
అందున
ఓ.ఎస్. నెం. 55/2020

మధ్య:
పిటీషనరు/ వాది:
శ్రీ గంగిరాజు శ్రీరామ ప్రభాకరరావు
మరియు
రెస్పాండెంటు/ప్రతివాదులు:
శ్రీ గంగిరాజు వీర వెంకట సత్యన్నారాయణ వగైరాలు

కోర్టు వారి ఆనతి మేర

పై దావాను మరియు పిటీషనుతో వాది/పిటీషనరు మీ పై డిక్లరేషను మరియు ఇంజక్షను కోరి దాఖలు చేసి పెక్కుదినములు అయినను మీరు సదరు దావా గ్రంధమున మరియు టెంపరరీ యింజక్షను గ్రంధమున 2, 7, 9వ ప్రతివాదులు/ పిటీషనరులు అయినను మరియు మీరు 1వ వారి సమీప బంధువర్గము అయినను మీరు సదరు గ్రంధములలో తమ అపియరెన్సు మాని కావలెనని కాలయాపన సాగించుచున్నారు. సదరు విషయమును కోర్టు వారి దృష్టికి తీసుకు వెళ్ళగా శ్రీ కోర్టు వారు సదరు ఐ.ఎ నోటీసును మరియు దావా సమను తమ పేపరు ద్వారా పంపించ ఆదేశించినందున

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా సదరు పై గ్రంధము **ది. 02-12-2022న వేసియున్నారు.** కావున ఆరోజున మీరు ఖుద్దున గాని, విషయ పరిచయము గల వకీలు గారి ద్వారా ఆరోజున వచ్చి తమ స్టేటుమెంటు మరియు కౌంటరులు దాఖలు చేసుకొనగలరు. అట్లుల కాని పక్షమున సదరు దావా గ్రంధము మరియు పిటీషను మీ పరిముఖము లేకనే తదుపరి స్టెప్ తీసుకొన బడునని యిందుమూలముగా తెలియచేయుచున్నాను.

1. Respondent/ Defendant No.2:
Gangirju D.V.N.V.Prasad, Son of Veera Venkata Satyanarayana, aged 38 years, Hindu, Private Employment in Hyderabad and Permanent resident of H.No. 3-21, Vissakoderu, Palakoderu Mandalam.

2. Respondent/ Defendant No.7:
Smt. Konisetti Chandrika, Wife of Balaji, aged 32 years, H.No. 3-118, House wife, Losasrigutlapadu, Gollavani tippa Hospital, near by Bhimavaram Mandal.

3. Respondent/ Defendant No.9:
Kommireddi Durga Sai Venkata Mahesh, Son of Ganesh, aged 28 years, Kotikireddy vari street, H.No. 8-202, Vissakoderupalem, Palakoderu Mandal.

యాళ్లబండి రామకృష్ణ పరమహంస
అడ్వకేటు, తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం సెల్: 9948169761
తేదీ. 29-11-2022 6303018736